బట్టలు కొనేందుకు వచ్చి.. లిఫ్ట్‌లో చిక్కి

- అరగంట సేపు వినియోగదారుడి కుటుంబం ఇబ్బందులు
- పట్టించుకోని నిర్వాహకులు

జమ్మికుంట, జూన్14 : తన కూతురు బర్త్‌డే సందర్భంగా బట్టలు కొనేందుకు వెళ్లిన ఓ వినియోగదారుడి కుటుంబ సభ్యులు లిఫ్ట్‌లో చిక్కుకున్నారు. అరగంట సేపు అందులోనే ఉండి పోయి ఇబ్బంది పడి చివరకు ఎలాగోలా బయటపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. జమ్మికుంటలోని కృష్ణకాలనీకి చెందిన మద్దూరి శ్రీనివాస్ విద్యుత్ శాఖలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల చివరి వారంలో తన కూతురు పుట్టిన రోజు ఉండడంతో స్థానికంగా ఉన్న ఓ బట్టల షాపులో షాపింగ్ చేసేందుకు భార్యా పిల్లలతో గురువారం రాత్రి వెళ్లాడు. రెండో ఫ్లోర్‌లో బట్టలు కొనుగోలు చేశాడు. అనంతరం ఫ్లోర్‌లో ఉండే ఉద్యోగితో సహా వినియోగదారుడి కుటుంబ సభ్యులు లిఫ్ట్ ఎక్కారు. ఏం జరిగిందో.. ఏమో కొన్ని సెకండ్లలోనే లిఫ్ట్ ఆగిపోయింది. దీంతో భయాందోళనకు గురై లిఫ్ట్‌లో అరిచారు. డోర్లను కొట్టారు. లిఫ్ట్ కిందకు వెళ్లలేదు. శ్వాసకు ఇబ్బంది పడ్డారు. దాదాపు అరగంటసేపు అందులోనే ఉండిపోయారు. అంతలోనే శ్రీనివాస్ ఫోన్ ద్వారా తన మిత్రులకు తెలుపడంతో.. వారు షాపులోని నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. అప్పుడు లిఫ్ట్ ఆగిందనే విషయం తెలుసుకున్నారు. కాగా, లిఫ్ట్‌లో ఉన్న శ్రీనివాస్ ఏఎల్ఎం కావడంతో అప్పటికే తనకున్న పరిజ్ఞానంతో లిఫ్ట్‌ను రిపేర్ చేయగా, ఎట్టకేలకు అది మూవ్ అయి కిందకు వచ్చారు. లిఫ్ట్ నుంచి బయట పడడంతో శ్రీనివాస్ ఫ్యామిలీ, ఉద్యోగి ఊపిరి పీల్చుకున్నారు. లిఫ్ట్ ఆగిపోవడంపై శ్రీనివాస్ కుటుంబసభ్యులు షాపు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లిఫ్ట్ రిపేర్ కావడం.. వినియోగదారులు ఇబ్బంది పడడం ఇదేమీ కొత్త కాదని, గతంలోనూ ఇలాగే జరిగిందని అక్కడే ఉన్న వినియోగదారులు ఆరోపించారు.

నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, శనివారం 15 జూన్ 2024 | KARIMNAGAR

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 14 : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్-2025 పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని కరీంనగర్ జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆబ్జెక్టివ్ విధానంలో అప్టిట్యూడ్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ విధానంలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించని అభ్యర్థులు ఈ నెల 13 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో http:\\studycircle.cgg.gov.in,http;\\twd. telangana.gov.in లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 6281766534 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా కరీంనగర్

- అందుబాటులో మెడికల్, ఇంజినీరింగ్, వ్యవసాయ కాలేజీలు • రాష్ట్ర స్థాయిలో సత్తాచాటుతున్న ఇంటర్, డిగ్రీ కళాశాలలు, స్కూళ్లు
- ఇక్కడే అపారమైన ఉపాధి అవకాశాలు • ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 14 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలతోపాటు వ్యవసాయ, ఫార్మసీ, డిగ్రీ, ఐటీఐ కళాశాలలు, కోచింగ్ సెంటర్లతో విద్యానిలయంగా నిలుస్తున్నది. ఇప్పటికే రెండు ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, నాలుగు ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నాయి. మరోవైపు పదుల సంఖ్యలో ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీలతోపాటు వ్యవసాయ కళాశాలలు కూడా ఉన్నాయి. ఉన్నత విద్యతోపాటు ఇంటర్ విద్యలోనూ పలు విద్యాసంస్థల జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తూ విద్యారంగంలో తమదైన ముద్ర వేసుకుంటున్నాయి. అలాగే, ఇక్కడి విద్యాసంస్థలు తమ స్కూళ్లలో స్టేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ వంటి సిలబస్‌ను ప్రవేశ పెడుతున్నాయి. మొత్తంగా మంచి విద్యతోపాటు పార్ట్ టైం ఉద్యోగాలు సైతం చేసుకునేందుకు అపార అవకాశాలున్నాయి. ప్రైవేట్ సంస్థలతోపాటు కొత్త కొత్తగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటవుతున్నాయి. ఇలా అన్నింటికీ కరీంనగర్ కేరాఫ్‌లా నిలుస్తుండడం, ఇక్కడ తక్కువ ఖర్చు తో నాణ్యమైన విద్య అందుతుండడం, అపారమైన అవకాశాలు ఉండడంతో చుట్టుపక్కల జిల్లాల వాసులు ఇక్కడ చదువు కునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక్కడి విద్యాసంస్థలు, వసతి గృహాల్లో నాణ్యమైన భోజన వసతులతో పాటు, వసతి కల్పిస్తుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడే చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు.